

RNI NO. TEL/TEL/2018/76342

# లోకంతీరు

సామాజిక, రాజకీయ దిన పత్రిక

స్పెషల్ సంచిక

నిజామాబాద్, కామారెడ్డి | బుధవారం | 07-08-2024 | పేజీలు : 03 | వెల ; 3.00





**హైదరాబాద్, ఆగస్ట్ 06 ( లోకంతీరు ) :** తెలంగాణ సాధనే ధ్యేయంగా జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి నివాళి అర్పించారు. 'ఒకరిని యాచించడం కాదు.. ఇక్కడి ప్రజలే శాసించే తెలంగాణ కావాలి' అన్న జయశంకర్ గారి మాటల స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, పెద్ద సారు కోరుకున్న విధంగా తెలంగాణలో ప్రజాస్వామిక సంస్కృతిని ప్రజా ప్రభుత్వం తిరిగి నిలబెట్టిందని ముఖ్యమంత్రి గారు ఒక సందేశంలో పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వం కొలువైన తర్వాత మొదటి కేబినెట్ సమావేశంలో తొట్టతొలి నిర్ణయంగా జయశంకర్ సార్ స్వస్థలం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా గుర్తించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

## పెట్టుబడులే లక్ష్యంగా

### అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- హైదరాబాద్‌లో ఆర్సీజియం విస్తరణకు ఒప్పందం
- హైదరాబాద్‌లో 500 మంది అత్యాధునిక సాంకేతిక నిపుణులను కంపెనీ నియమించుకోనుంది.




**హైదరాబాద్, ఆగస్ట్ 05 ( లోకంతీరు ) :** హైదరాబాద్‌లో ఆర్సీజియం (Arcesium) విస్తరణకు ఒప్పందం తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మరో కంపెనీతో అవగాహన కుదుర్చుకుంది. అసెట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ సర్వీసెస్, అడ్వాన్స్‌డ్ డేటా ఆపరేషన్స్‌లో ప్రముఖ కంపెనీ ఆర్సీజియం (Arcesium) హైదరాబాద్‌లోని తమ కంపెనీని విస్తరించడానికి అంగీకరించింది. ఆర్సీజియం (Arcesium) సీఈఓ గౌరవ్ సూరి గారు, ఇతర ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర అధికారుల బృందం జరిపిన చర్చల్లో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఆర్సీజియం (Arcesium) అంతర్జాతీయంగా బయటి దేశాల్లో మొదటి శాఖను హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేసింది. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అందిస్తున్న సహకారంతో తమ సేవలను మరింతగా విస్తరిస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. అంతర్జాతీయ స్థాయిలో కావలసిన సదుపాయాలకు అనుగుణంగా హైదరాబాద్‌లోని గొప్ప టాలెంట్ ఫోర్స్, సహజ రీతిలో ఉండే లొకేషన్, నైపుణ్యం కలిగిన స్థానిక ఉద్యోగుల లభ్యత కారణంగా అంకితభావంతో హైదరాబాద్‌లో డాటా సొల్యూషన్ సర్వీసులను అభివృద్ధి పరుస్తున్నామని గౌరవ్ సూరి తెలిపారు. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో 500 మంది అత్యాధునిక సాంకేతిక నిపుణులను కంపెనీ నియమించుకోనుంది. డీఈ షా గ్రూప్ (DE Shaw group), బ్లాక్‌స్టోన్ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ Blackstone Alternative Asset Management (BAAM) మద్దతుతో ఆర్సీజియం (Arcesium) స్వతంత్ర సంస్థగా ప్రారంభమైంది. ఆర్సీజియం (Arcesium) తన సేవలను విస్తరణ చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి కంపెనీ ప్రతినిధులను అభినందించారు. కంపెనీకి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. తెలంగాణలో ఐటీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

## హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ

### ఇండియాకు కొత్త చిరునామా

- తెలంగాణ అంటేనే పెట్టుబడుల గమ్యస్థానం.. వ్యాపారాలకు సులభంగా కొత్త పారిశ్రామిక విధానం
- అమెరికాలో రౌండ్ టేబుల్ సమావేశంలో పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 05 ( లోకంతీరు ) :** తెలంగాణలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పరిశ్రమల అవసరాలు, అభిరుచికి అనుగుణంగా తమ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తుందని ప్రకటించారు. అమెరికాలో ఉన్న వ్యాపార అవకాశాలన్నీ తెలంగాణలో ఉన్నాయని, చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ సంకల్పమని అన్నారు. తెలంగాణ అంటేనే వ్యాపారం.. తెలంగాణ అంటేనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తామని చెప్పారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను ఈ సందర్భంగా సీఎం వివరించారు. త్వరలోనే హైదరాబాద్లో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఇది భారత దేశపు భవిష్యత్తుకు చిరునామాగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు. దేశంలోనే జీరో కార్బన్ సిటీ ఇక్కడ ఏర్పడతుందని అన్నారు. ఫ్యూచర్ సిటీలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్తో పాటు, మెడికల్, టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్‌వేర్, ఫార్మా విలేజ్లను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ఫ్యూచర్ సిటీ రాష్ట్ర అభివృద్ధితో పాటు పరిశ్రమలకు సిరుల పంట పండిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో వ్యాపారాలు, పెట్టుబడుల విస్తరణను సులభతరం చేస్తామని సీఎం ప్రకటించారు. అటువంటి సరికొత్త ఆలోచనలతోనే కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్కింగ్ లంచ్ అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో రౌండ్‌టేబుల్ సమావేశమయ్యారు. ఫార్మా, ఐటీ, టెక్నాలజీ, ఈవీ, బయోటెక్, షిప్పింగ్ రంగాల్లో పేరొందిన కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నఛైర్‌పర్సన్‌లు, సీఈవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్తో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని పారిశ్రామిక క్లస్టర్లుగా విభజించి, అభివృద్ధి చేసేందుకు రూపొందించిన భవిష్యత్తు ప్రణాళికలు, తెలంగాణ చరిత్రపై ముఖ్యమంత్రి ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తన మనసులోని మాటలతో పాటు తమ ప్రభుత్వం ఏం కోరుకుంటుందో.. తన రాష్ట్ర ప్రజల ఆకాంక్షలేమిటో వెల్లడిస్తానంటూ అందరినీ ఉత్సాహపరిచారు. ముఖ్యమంత్రి హోదాలో ఇది తన మొదటి అమెరికా పర్యటన అని.. ఇక్కడి నుంచి వీలైనన్ని పెట్టుబడులు తెలంగాణకు తీసుకెళ్లాలలన్నదే తన లక్ష్యమని ప్రకటించారు. పెట్టుబడుల గమ్యస్థానంగా దేశంలోనే అందరినీ ఆకర్షిస్తున్న తెలంగాణకు

2లో



లోకంతీరు
RNI NO. TEL/TEL/2018/76342
నిజామాబాద్ కామారెడ్డి
పేజీ-2
నిజామాబాద్, కామారెడ్డి | బుధవారం | 07-08-2024 | పేజీలు : 03 | వెల : 3.00

(పేజీ తరువాయి )

# హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ
## ఇండియాకు కొత్త చిరునామా

ఉన్న అనుకూలతలన్నింటినీ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, లైఫ్-సైన్స్, ఫార్మా రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలలో బలమైన పునాదులు వేసుకుందని చెప్పారు. కోవిడ్ను అధిగమించేందుకు మిలియన్ల కొద్దీ వ్యాక్సిన్‌లను తయారు చేసి ప్రపంచానికి సాయం చేసిందని అన్నారు.

తెలంగాణలో అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని, అద్భుతమైన ప్రతిభ సంపద సిద్ధంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చే పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమమైన మద్దతును అందిస్తుందని ప్రకటించారు. నిజాంలు నిర్మించిన 425 సంవత్సరాల పురాతనమైన హైదరాబాద్, ఇంచుమించుగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాతో సమకాలీనంగా ఉండటం ఆసక్తి రేపుతోందని అన్నారు.అభిరుచితో పాటు అద్భుతమైన దూరదృష్టితో తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ప్రపంచ పారిశ్రామికవేత్తలందరూ ఒకసారి తెలంగాణకు రావాలని, హైదరాబాద్ నగరాన్ని సందర్శించాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. హైదరాబాద్లో ఉన్న అనుకూలతలతో పాటు అక్కడున్న అవకాశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కలిసికట్టుగా గొప్ప భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు.తెలంగాణను చైనాకు ప్రత్యామ్నాయ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి దార్శనికతను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్బాబు ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు వివరించారు. ప్రపంచంలోనే టాప్ టెన్ సిటీల్లో ఒకటిగా హైదరాబాద్ను అభివృద్ధి చేస్తామని, ఆ దిశగా రూపొందించిన భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించారు. ఈ సమావేశం తెలంగాణలో కొత్త పెట్టుబడులకు మరింత ఊతమిస్తుందనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.కార్నింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రోనాల్డ్ వెర్క్లెరెన్, కేకేఆర్ పార్టనర్ దినేష్ పలివాల్, సిగ్నా ఇంటర్నేషనల్ పబ్లిక్ పాలసీ హెడ్ ఎక్రమ్ సర్వర్, న్యూజెర్సీ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బిల్ నూనన్, సేఫ్‌సీ గ్రూప్ ఛైర్మన్ ఎస్వీ అంచన్, టిల్మాన్ హోల్డింగ్స్ ఛైర్మన్ సంజీవ్ అహుజా, అమ్నీల్ ఫార్మా కో సీఈవో చింటూ పటేల్,జేపీ మోర్గాన్ చేజ్ ఈడీ రవి లోచన్ పోలా, ఆక్వాటెక్ వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) సుబ్బారావు, యాక్సెంచర్ ఎండీ అమిత్కుమార్, డెలాయిట్ ఎండీ పునిత్ లోచన్, హాబిట్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ వీర బుద్ధి, బీఎన్వై మెల్లన్ ఎండీ అట్లూరి, పేస్ యూనివర్సిటీ డీన్ డా. జోనాథన్ హిల్, అకుజెన్ చీఫ్ సైంటిఫిక్ హెడ్ అరుణ్ ఉపాధ్యాయ, ఎస్ అండ్ పీ గ్లోబల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ స్వామి కొచ్చెర్లకోట, ఇంటర్కాంటినెంటల్ ఎక్స్ఛేంజ్ ఎండీ అశ్విని పన్సే ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# తెలంగాణలో 2జీ బయో ఇథనాల్ ప్లాంట్

**- స్వచ్ఛ్ బయో రూ.1000 కోట్ల పెట్టుబడి..**
**- 500 మందికి ఉద్యోగాలు**

హైదరాబాద్, ఆగస్ట్ 05 ( లోకంతీరు ) : బయో ఫ్యూయల్స్ తయారీ సంస్థ స్వచ్ఛ్ బయో తెలంగాణలో పెట్టుబడులకు సిద్ధపడింది. త్వరలోనే తెలంగాణలో సెకండ్ జనరేషన్ సెల్యులోసిక్ బయో ఫ్యూయల్ ప్లాంట్ నెలకొల్పనుంది. మొదటి దశలో దాదాపు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ నిర్మించనుంది. ఈ ప్లాంట్ ఏర్పాటులో 250 మందికి ప్రత్యక్షంగా, 250 మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబుతో పాటు తెలంగాణ అధికార ప్రతినిధి బృందంతో స్వచ్ఛ్ బయో ఛైర్ పర్సన్ ప్రవీణ్ పరిపాటి చర్చలు జరిపారు. స్వచ్ఛ బయోతో అంతర్జాతీయ భాగస్వామిగా ఉన్న సుగనిత్ బయో రెన్యువబుల్స్ కంపెనీ బయోమాస్, సెల్యులోజ్ నుండి జీవ ఇంధనాలు మరియు జీవ రసాయనాలను ఉత్పత్తి చేసే పేటేంట్ పొందటంతో పాటు అవసరమైన సాంకేతికతను అభివద్ధి చేసింది.ఈ కంపెనీ పెట్టుబడులు రాష్ట్రంలో సుస్థిరమైన, పర్యావరణ అనుకూలమైన వృద్ధికి దోహదపడనుంది. అందుకే పెట్టుబడులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ వికేంద్రీకృత అభివృద్ధి దృక్పథం తమను ఆకట్టుకుందని కంపెనీ ఛైర్మన్ ప్రవీణ్ పరిపాటి అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోవటం తమకు ఆనందంగా ఉందన్నారు. రాబోయే కాలంలో మరిన్నిప్లాంట్లు ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని బయో ఫ్యూయల్స్ హబ్‌గా మార్చాలనే తమ ఆలోచనలను అధికారులతో పంచుకున్నారు.




# ఆచార్య జయశంకర్ ఆశయాలకు
## అనుగుణంగా ముందుకు సాగుదాం

**- జయంతి వేడుకలో ఎమ్మెల్యేలు, కలెక్టర్**

3లో

నిజామాబాద్, ఆగస్టు 06 ( లోకంతీరు ) : తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, అదే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని కంటేశ్వర్ చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ అందించిన సేవలను కొనియాడారు. అనేక వనరులు ఉన్నప్పటికీ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం ఆశించిన రీతిలో అభివృద్ధి సాధించకపోవడానికి గల కారణాలను, తెలంగాణాకు




# ఏర్గట్ల మండలంలో
## పలువురు ఆత్మీయ కుటుంబాలను పరామర్శించిన

**- మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి..**



ఆగస్టు 06 ( లోకంతీరు ) : ఏర్గట్ల మండలం తాళ్లారంపూర్ గ్రామంలో రాంపెల్లి లక్ష్మీపతి మాతృమూర్తి ని కోల్పోవడంతో వారి కుటుంబాన్ని.ఏర్గట్ల మండల కేంద్రంలో సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య గారి భార్య కు ఆరోగ్యం బాగా లేక పోవడంతో వారిని,జక్కు భూమయ్య భార్య కాలం చేయడంతో వారిని,తునికి గంగారాం తల్లి గారు కాలం చేయడంతో వారిని,శంకర్ గౌడ్,రాజు తల్లి కాలికి గాయం కావడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం 5000 రూపాయలు ఇచ్చి నిజామాబాద్ సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్ తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.




నిజామాబాద్, ఆగస్టు 06 ( లోకంతీరు ) : ఇందూర్ నగరం :ప్రొపెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా కంటేశ్వర్ చౌరస్తాలో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గారు మాట్లాడుతు తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారు విద్యావంతుడు మేధావి కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా ఆయన పనిచేయడం జరిగిందని ప్రతేక తెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం తన జీవితాన్నే త్యాగం చేసి ఎన్నో ఉద్యమలు చేయడం జరిగిందని, యూనివర్సిటీ వేదికగా తన రాసిన పుస్తకాల ద్వారా, మాటల ధ్వరా విద్యార్థులను చైతన్యం చేస్తూ తెలంగాణ ఉద్యమన్ని గల్లీ నుండి ఢిల్లీ వరకు నడిపించడంలో కీలక పాత్ర పోషించారని,తెలంగాణ వస్తే మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకు దక్కుతాయి పరాయి వాని పాలనలో మనం బానిసలాగా బతుకుడెంది అని విద్యార్థులను చైతన్యం చేస్తూ రాబోయే ప్రతేకతెలంగాణ రాష్ట్రాన్ని చూడాలనే ఒకే కోరిక వారికీ ఉండేదని కానీ వారు తెలంగాణ రాష్ట్ర అవతరణకు ముందే మరణించడం



దురదుష్టకరం అని,ప్రొపెసర్ జయశంకర్ గారు ప్రస్తుతం మన మధ్య లేకపోయినా యావత్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ఆయన జయంతి సందర్భంగా వారికీహొ ఘన నివాళులు అర్పించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ వేడుకలు

బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 06 ( లోకంతీరు) : ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం రోజున ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ముఖ్యఅతిథిగా ప్రత్యేక అధికారి స్రవంతి హాజరయ్యారు. అదేవిధంగా వివిధ గ్రామాలలో సైతం జయశంకర్ జయంతి వేడుకల్ని నిర్వహించారు.



లోకంతీరు
RNI NO. TEL/TEL/2018/76342
నిజామాబాద్ కామారెడ్డి
పేజి-3
నిజామాబాద్, కామారెడ్డి | బుధవారం | 07-08-2024 | పేజీలు : 03 | వెల : 3.00

(పేజీ తరువాయి )

# ఆచార్య జయశంకర్ ఆశయాలకు

## అనుగుణంగా ముందుకు సాగుదాం

- జయంతి వేడుకలో ఎమ్మెల్యేలు, కలెక్టర్






జరిగిన అన్యాయాలను ప్రజలకు కళ్ళకు కట్టినట్టు వివరించడంలో జయశంకర్ కృతకృత్యులయ్యారని అన్నారు. తెలంగాణ భావజాలాన్ని ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లిన మహనీయుడని ప్రశంసించారు. 1969 ఉద్యమంతో పాటు మలి విడత ఉద్యమం లోనూ ప్రజలను ప్రత్యేకించి విద్యార్థులు, యువతను ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగస్వామ్యం చేశారని గుర్తు చేశారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ప్రత్యేక రాష్ట్రం కోసం గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాటం కొనసాగించారని అన్నారు. ఆయన ఆశయం అయిన తెలంగాణ రాష్ట్రం సిద్ధించినప్పటికీ, అంతకు ముందే ప్రొఫెసర్ జయశంకర్ స్వర్గస్థులు కావడం ఎంతో బాధ కలిగించిందన్నారు.కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలను చైతన్యపరుస్తూ అహరహం శ్రమించారని గుర్తు చేశారు. ఆయన సేవలను స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తోందని అన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనకు అన్ని వర్గాల వారు సమిష్టిగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు ప్రొఫెసర్ జయశంకర్ సేవలను శ్లాఘిస్తూ, జయంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, అదనపు డీసీపీ కోటేశ్వరరావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# పారిస్ ఒలింపిక్స్‌లో

## భారత్‌కు ఖాయమైన మరో పతకం..

- సెమీస్‌లో క్యూబా క్రీడాకారిణి గుజ్‌మాన్‌పై గెలిచిన ఫోగట్
- 50 కేజీల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో 5-0 తేడాతో బౌట్ గెలిచిన భారత రెజ్లర్
- స్వర్ణ పతకం కోసం ఫైనల్లో అమెరికా రెజ్లర్ సారా హిల్డెబ్రాండ్‌తో తలపడనున్న ఫోగట్



**హైదరాబాద్, ఆగస్ట్ 05 ( లోకంతీరు ) :** పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. అంచనాలను అందుకుంటూ భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ మహిళ 50 కేజీల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో ఫైనల్ చేరింది. సెమీఫైనల్‌లో క్యూబా రెజ్లర్ యుస్నీలిస్ గుజ్‌మాన్‌తో జరిగిన బౌట్‌లో 5-0తో విజయం సాధించింది. ఈ మ్యాచ్ ఆరంభం ఫోగట్ ఆధిపత్యం ప్రదర్శించింది. ప్రత్యర్థి నుంచి పెద్దగా ప్రతిఘటన లేకపోవడంతో తొలి పిరియడ్ ముగిసే సమయానికి ఫోగట్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో పీరియడ్‌లో ఆమె 5-0తో భారీ ఆధిక్యాన్ని సాధించింది. ఆధిక్యాన్ని చివరి వరకు అలాగే కొనసాగించడంతో బౌట్ భారత వశమైంది.ఒలింపిక్స్ క్రీడల్లో రెజ్లింగ్ విభాగంలో ఫైనల్లో పతకం అందించనున్న తొలి భారతీయ మహిళ వినేశ్ ఫోగట్ నిలవడం ఖాయమైంది. సెమీస్‌కు చేరిన తొలి మహిళగా ఇప్పికే రికార్డు సృష్టించారు. కాగా 2016 ఒలింపిక్స్‌లో క్వార్టర్స్‌లో ఓడిపోయిన సాక్షి మాలిక్

# తాగునీరు -వర్షపునీటి

## సంరక్షణ కార్యక్రమం



**బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 06 ( లోకంతీరు ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వచ్ఛధనం-పచ్ఛధనం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున 'తాగునీరు-వర్షపునీటి' సంరక్షణపై పలు కార్యక్రమాలు చేపట్టినట్లు ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్, ఎంపీవో యం.డి.గౌస్ మోహిమోద్దీన్ లు తెలిపారు. ముప్కాల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని కొత్తపల్లి, వేంపల్లి, నాగంపేట్, నల్లూర్, వెంచిర్యాల, రెంజర్ల గ్రామాల్లో 'తాగునీరు-వర్షపునీటి' సంరక్షణపై కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మను భాకర్‌ను సత్కరించిన

## నీతా అంబానీ

- ప్యారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన మను భాకర్
- 50 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో కాంస్యం సాధించిన స్వప్నిల్ కుశాలే
- కుశాలేను కూడా సత్కరించిన నీతా అంబానీ



**హైదరాబాద్, ఆగస్ట్ 06 ( లోకంతీరు ) :**ప్యారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన యువషూటర్ మను భాకర్‌ను రిలయన్స్ ఫౌండేషన్ చైర్ పర్సన్, ఐవోసీ సభ్యురాలు నీతా అంబానీ సత్కరించారు. మను భాకర్‌తో పాటు పురుషుల 50 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో కాంస్యం సాధించిన స్వప్నిల్ కుశాలేను కూడా సత్కరించారు.ఈ సందర్భంగా నీతా అంబానీ మాట్లాడుతూ... ఈ ఒలింపిక్స్‌లో మన షూటింగ్ టీమ్ అత్యుత్తమ ఫామ్‌లో ఉందన్నారు. 50 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో పతకం గెలిచిన మొదటి ఇండియన్‌గా స్వప్నిల్ కూడా చరిత్ర సృష్టించారన్నారు. స్వప్నిల్ కుశాలేకు అందరం శుభాకాంక్షలు చెబుదామన్నారు.

# ఏపీ సీఎం చంద్రబాబుకు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి

- చంద్రబాబుకు తెలంగాణ ఎమ్మెల్యే రాజా సింగ్ బహిరంగ లేఖ
- ఏపీలోని పురాతన దేవాలయాలను రక్షించాలని విజ్ఞప్తి
- దేవాలయాల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేఖ

**హైదరాబాద్, ఆగస్ట్ 06 ( లోకంతీరు ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తెలంగాణ రాష్ట్ర గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ విజ్ఞప్తి చేశారు. ఏపీలోని పురాతన దేవాలయాలను వివిధ మతాల వారు ఆక్రమించుకున్నారని, వాటిని సంరక్షించాలని కోరారు. దేవాలయాల భూములను ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన ఏపీ సీఎంకు బహిరంగ లేఖ రాశారు.



అనేక పురాతన హిందూ దేవాలయాలు ఇతర మతాల వారి ఆధీనంలోకి వెళ్లాయని, వారు ఆయా ప్రాంతాల్లో దుకాణాలు తెరుస్తున్నారని, మత మార్పిళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇది హిందువుల మనోభావాలని దెబ్బతీస్తోందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అటువంటి ఆక్రమణల నుండి ఈ దేవాలయాలన్నింటికి వెంటనే విముక్తి కల్పించాలని కోరుతున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి పలు సూచనలు చేశారు.